

'పది'లో ఐదుగురు విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి పరీక్షా కేంద్రంలో చూసిరాతకు పాల్పడుతున్న విద్యార్థులను స్క్వాడ్ గుర్తించి డిబార్ చేసిందన్నారు. జిల్లావ్యాప్తంగా 149 కేంద్రాల్లో నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షను 28,278 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 144 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షకు కు 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. 47 మందికి గానూ 31మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

'ఆశా'లకు కనీస వేతనం ఇవ్వాలి

- ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి
- జిల్లా నోడల్ అధికారి రవిప్రసాద్‌కు వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఆశాల జాతీయ కోర్కెల దినం సందర్భంగా ఆశావర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు, పెన్షన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన జిల్లా వైద్యారోగ్యశాఖ ఆశాల జిల్లా నోడల్ అధికారి రవిప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. జాతీయ ఆరోగ్య మిషన్ స్కీమ్ ఏర్పడి 20 ఏళ్లయినా, ఆశాలకు కనీస వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చాలామంది ఆశావర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆశా వర్కర్లకి కేవలం రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంచిందని తెలిపారు. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు వేతనం పెంచలేదని విమర్శించారు. వైద్యారోగ్య రంగానికి నిధుల కేటాయింపులు నానాటికీ తగ్గుతున్నాయని, ప్రజారోగ్యానికి భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశాల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పంద జిఒలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, నాయకులు పి.జయలక్ష్మి, మన్నె మణికుమారి, రాకోటి సుజాత, కె.లీలావతి, చంద్రకళ, జి.కళ్యాణి, పి.సుహాసిని, సంతోషి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రైవేట్ ఆస్పత్రులకు ధీటుగా రిమ్స్

డిఎంఇ రఘునందనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా రిమ్స్ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సేవలందిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) డాక్టర్ రఘునందనరావు అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలను శుక్రవారం సందర్శించి పలు సూచనలు చేశారు. కళాశాలలో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రిమ్స్ కళాశాలతో పాటు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అదనపు భవనాలు నిర్మించినా, వినియోగంలోకి తీసుకురావడంలో జాప్యం సరికాదన్నారు. ఈ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం హెచ్‌ఒడిలతో సమావేశమయ్యారు. కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్య చదువుతున్న విద్యార్థులతో ఇంటరాక్టు తరగతిని నిర్వహించారు. భవిష్యత్‌లో మెరుగైన వైద్యం అందించడానికి ఆలోచనల్లో మార్పు రావాలని సూచించారు. అనంతరం పలు విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలం, సూపరింటెండెంట్ డాక్టర్ షకీల, ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డిఎంఇ రఘునందనరావు

మరిన్ని వార్తల కోసం www.prajasakti.com

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు పట్టుదలతో శ్రమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి సూచించారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో వార్షిక వేడుకలను సిల్వర్ జూబ్లీ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు బెట్టింగ్, మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని చెప్పారు. వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యతోనే ఉన్నత స్థానాలు సాధ్యమని, అప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మాట్లాడుతూ వార్షిక వేడుకలు కళాశాల ఉన్నతికి, ఐక్యతకు చిహ్నమన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో సాధించిన నాక్ రీ-అక్రెడిటేషన్, అడ్మిషన్లు, అధ్యాపకుల పురోభివృద్ధి, విద్యార్థులు సాధించిన విజయాలు, కళాశాల సర్వతోముఖాభివృద్ధి సాధనలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిపిడిసి సభ్యులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

రహదారులే అభివృద్ధికి సోపానాలు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రహదారులే అభివృద్ధికి సోపానాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో గల కొండపై ఉన్న పోలీస్ రిపీటర్ స్టేషన్‌కు కొత్తగా నిర్మాణం చేపడుతున్న సిసి రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు జాతీయ రహదారి నుంచి హుదూద్ ఎలమంచిలి రోడ్డు వరకు చేపడుతున్న రహదారి నిర్మాణం, హుదూద్ భవనాలను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రహదారులు, భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించాల్సిన వాటి అంచనాలపై అధికారులకు సూచనలు చేశారు. వ్యవసాయ మార్కెట్ పరిధిలో సౌకర్యాలు, అభివృద్ధి పనులను పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

స్థానిక ఎన్‌టిఆర్ భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ అప్పలరాజు, పంచాయతీరాజ్ ఎఇలు రామనాథం, కె.రంజిత్ కుమార్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, రమేష్, మాజీ ఎంపిపి టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



మాటాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - జి.సిగడాం

ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు పి.సుధాకరరావు హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ అవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 31 పంచాయతీల్లో చేపట్టిన పలురకాల పనులకు గానూ రూ.21.69 కోట్లకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. ఉపాధి హామీ, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, సమగ్ర శిక్ష విభాగాల్లో చేపట్టిన పనులకు మెటీరియల్ రూ.2.68 కోట్లు, వేతనాలకు రూ.19.77 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. గోకులం షెడ్లు నిర్మాణాలు చేపట్టినా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని ధవళపేట మాజీ సర్పంచ్ కంచరాన సూరన్నాయుడు చెప్పారు. మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను గాలికొదిలేశారని జెడ్‌పిటిసి సభ్యులు కాయల రమణ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తప్పుడు మస్టర్లకు తావులేకుండా ప్రజా అవసరాల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంపిడిఒ జి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావేదికలో ఎపిడిలు పంచాది రాధ, లోకేష్, స్వరూపారాణి, ఎపిఒ సత్యనారాయణ, ఎస్ఆర్‌పి పున్నంనాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్‌లో వెనుకబాటు వల్లే మెమోలు

ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పోషణ్ ట్రాక్ యాప్‌లో ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజ్డ్ సిస్టమ్) కేప్చర్‌లో బాగా వెనుబడడం వల్లే సిడిపిఒలకు మెమోలు జారీ చేశామని జిల్లా స్త్రీ, శిశుసంక్షేమం, సాధికారత అధికారి బి.శాంతిశ్రీ తెలిపారు. ప్రజాశక్తి జిల్లా పేజీలో ఈనెల 21వ తేదీన 'యాప్ సోపాలు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆమె వివరణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, లబ్ధిదారుల వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదుకు ప్రభుత్వం 3,358 కేంద్రాలకు ఫోన్లు అందించిందని తెలిపారు. జిల్లాలోని 16 ప్రాజెక్టుల సిడిపిఒల నివేదిక ప్రకారం 2,987 ఫోన్లు పనిచేస్తున్నాయని, పలు కారణాలతో 371 ఫోన్లు పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎస్ కేప్చర్ చేయడంలో ఎటువంటి ఇబ్బందుల్లేవని, అయినా కొంతమంది అంగన్‌వాడీలు ఆ పని చేయలేదన్నారు. దీనివల్ల సరైన విధానంలో పోషకాహారం పంపిణీ కాక లబ్ధిదారులు నష్టపోతారని చెప్పారు. సమస్యను పరిష్కరించే విధానంలో భాగంగానే 60 శాతం కంటే తక్కువ ఎన్‌రోల్ చేసిన కేంద్రాల పరిధిలోని సిడిపిఒలకు మహిళా శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు మెమోలు జారీ చేశామని తెలిపారు.



వికలాంగుల స్వాభిమాన్‌కు 12 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వికలాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మూడో శుక్రవారం స్వాభిమాన్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వాభిమాన్ గ్రీవెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వికలాంగుల శాఖ ఆధ్వర్యాన తాగునీరు, బిస్కెట్లు అందజేశారు. జిల్లావ్యాప్తంగా 12 మంది తమ వ్యక్తిగత వినతులను అందజేశారు. తన కుమారుడు సీపాన భరత్ కళ్యాణ్ కండరాల బలహీనతతో కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యారని, సదరం ద్వారా పూర్తిస్థాయి వికలాంగ పింఛను ఇప్పించాలని ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన సీపాన స్వాతి వినతిపత్రం అందించారు.

నగరంలోని పాత శ్రీకాకుళంలో నివాసముంటున్న సునీత గతంలో తనకు ఇస్తున్న వికలాంగుల పెన్షన్ నిలిచిపోయిందని, పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. తల్లిదండ్రులు వృద్ధులు కావడం వల్ల వారిపై ఆధారపడి జీవించాల్సి వస్తోందని వివరించారు. వికలాంగులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రైల్వే రాయితీ నిబంధనల్లో గతంలో 40 శాతం వైకల్యం ఉన్న వారితో పాటు సహాయకునికి ఉచిత ప్రయాణం అందించేవారని, అందుకు భిన్నంగా ఇప్పుడు 60 శాతానికి పెంచడం వల్ల అనేక మంది వికలాంగులు అర్హత కోల్పోతున్నారని వికలాంగుల సంఘాల ప్రతినిధులు వివరించారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసేందుకు ఉన్నతస్థాయిలో నివేదించాలని సూర్యనారాయణతో పాటు పలువురు కోరారు. స్వాభిమాన్ వినతులను డిఆర్‌ఒతో పాటు జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి కె.కవిత వినతులు స్వీకరించారు. వినతుల స్వీకరణ అనంతరం డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుని ఉన్నత లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. వైకల్యం ఉన్నంత మాత్రాన మానసికంగా కుంగిపోవాల్సిన అవసరం లేదని, మనోధైర్యాన్ని పెంచుకుని పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధికల్పన అధికారి కె.సుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు

23న అక్షరాస్యతా అర్హత పరీక్ష

శ్రీకాకుళం అర్బన్ : వయోజన విద్యా శాఖ ద్వారా ఉల్లాస్ కార్యక్రమంలో నమోదైన వయోజనులకు అక్షరాస్యతా పరీక్షను జాతీయ సార్వత్రిక విద్యా పీఠం సహకారంతో ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు వయోజన విద్య ఎడి ఎం.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని 2,840 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 39,940 మంది ఉల్లాస్ కార్యక్రమంలో నమోదయ్యారని, వారికి అర్హత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సిసిలు, విఒఎలు, అంగన్వాడీ టీచర్లు పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు మూడు గంటల పాటు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని వయోజన విద్య వాలంటరీ టీచర్లు శతశాతం హాజరు కావాలని తెలిపారు. జిల్లాలో శత శాతం హాజరు నమోదుకు యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్షరాస్యతలో జిల్లా ముందుండేందుకు సహకరించాలని కోరారు.

'పది' పరీక్షా కేంద్రంపై ఫిర్యాదు

ఆమదాలవలస : పదో తరగతి పరీక్షలకు సంబంధించి పట్టణంలోని ఎస్‌విఎస్ స్కూల్‌కు సంబంధించి 46 మంది విద్యార్థులను గేటు ఉన్నత పాఠశాలకు పరీక్షా కేంద్రం మంజూరు చేయడంలో అనుచిత నిర్ణయంపై పట్టణానికి చెందిన పలువురు పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర పరీక్షల విభాగం కమిషనర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని తొమ్మిది ప్రైవేటు పాఠశాలలకు చెందిన 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, అందులో ఒక్క ఎస్‌విఎస్ స్కూల్ విద్యార్థులకు మాత్రమే ఇలా ఒకే కేంద్రం కేటాయించడంపై వారు అభ్యంతరం తెలిపారు. నలుగురు పిల్లలున్న ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులకూ రెండు కేంద్రాలు కేటాయించి 46 మంది విద్యార్థులకు ఒకే కేంద్రం ఎలా కేటాయించడం సాధ్యమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఏర్పడిందన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని, భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు తలెత్తకుండా చూడాలని ఆ ఫిర్యాదులో కోరారు.

కె.ఆర్ స్టేడియం పనులు పూర్తి చేయాలి

శాప్ ఎమ్‌డిని కోరిన ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కోడి రామ్మూర్తి స్టేడియం పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ శాప్ ఎమ్‌డి గిరీష్‌ను కోరారు. విజయవాడలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయంలో నిర్మాణ పనులపై శ్రద్ధ చూపకపోవడం వల్ల క్రీడాకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి స్టేడియంకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని కోరారు. ఎపిఎంఐడిసి ఎమ్‌డిగా ఉన్న ఆయనకు సింగుపురం వద్ద అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్‌ను కలిసి గణగళ్లవానిపేట వద్ద సముద్రపు కోత అడ్డుకునేందుకు విపత్తుల నిర్వహణ కింద రక్షణ గోడ నిర్మించాలని కోరారు. కళింగపట్నం, నాగావళి నది పరివాహక ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

పెన్షనర్ల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెన్షనర్ల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ మర్రినాయుడు అన్నారు. పెన్షనర్లకు సేవ చేయడమే తమ ప్రథమ కర్తవ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లోని బిఎస్ఎన్ఎల్, డిఒటి పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఒక హోటల్‌లో పెన్షన్ అదాలత్‌ను శుక్రవారం నిర్వహించారు. పెన్షనర్ల అదాలత్‌లో తమ సమస్యలను విన్నవించారు. శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని బిఎస్ఎన్ఎల్, డిఒటి పెన్షనర్ల ప్రయోజనం కోసం వేదిక వద్ద డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఎపి సర్కిల్ సిసిఎ ఎస్.తారాచంద్ అధ్యక్షతన నిర్వహించిన అదాలత్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ బి.తిరుమలేసు బాబు, సీనియర్ అకౌంటెంట్ నారాయణ మూర్తి, రామకృష్ణ, ఇతర అధికారులు, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మర్రినాయుడు

నాటుసారాతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం పెంటిభద్ర, శాసనం గ్రామాల్లో నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారంతో దాడులు చేయగా ఇద్దరు వ్యక్తులు ఆరు లీటర్ల నాటుసారాతో పట్టుబడినట్లు సిఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. పెంటిభద్రకు చెందిన సవర రాజ్‌కుమార్ మూడు లీటర్ల నాటుసారా పట్టుకొని అమ్ముతుండగా పట్టుకున్నారు. శాసనంలో కుప్పిలి నారాయణ అనే వ్యక్తి మూడు లీటర్ల నాటుసారా అమ్ముతుండగా పట్టుబడ్డాడు. వీరిద్దరిని అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరు పర్చినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ షేక్ సైదా, పోలీసులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పలాసలోని కిడ్నీ పరిశోధనా కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పలు విభాగాల్లో ఒక సంవత్సరం పాటు తాత్కాలిక ప్రాతిపదికన అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి అదనపు డైరెక్టర్ అల్లు పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ఖాళీల వివరాలు

రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్ : 1 పోస్ట్, జీతం నెలకు రూ. 18,500. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.

డయాలసిస్ టెక్నీషియన్ : 6 పోస్టులు, జీతం నెలకు రూ.32,670. డయాలసిస్ టెక్నీషియన్ కోర్సులో డిప్లమో, ఎపిపిఎంబి, ఎపిఎహెచ్‌పి కౌన్సిల్‌లో నమోదు చేసుకోవాలి.

సి ఆర్మ్ టెక్నీషియన్ : 2 పోస్టులు, జీతం నెలకు రూ.32,670. గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిఎంఐటి కోర్సు చేసి ఉండాలి. ఎపిపిఎంబి, ఎపిఎహెచ్‌పి కౌన్సిల్‌లో నమోదు చేసుకోవాలి.

జనరల్ డ్యూటీ అటెండెంట్స్ : 3 పోస్టులు, జీతం నెలకు రూ.15 వేలు. పదో తరగతి అర్హత కలిగి ఉండాలి.

సెక్యూరిటీ గార్డు : 1 పోస్ట్, జీతం నెలకు రూ.15 వేలు. పదో తరగతి అర్హత కలిగి ఉండాలి.

దరఖాస్తు విధానం

దరఖాస్తులను అదనపు డైరెక్టర్, సూపరింటెండెంట్ కార్యాలయం, కిడ్నీ పరిశోధనా కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, పలాస, శ్రీకాకుళం జిల్లాలో పని వేళల్లో (ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు) ఏప్రిల్ ఆరో తేదీ లోపు సమర్పించాలి. మరిన్ని వివరాలకు ఆస్పత్రి అదనపు డైరెక్టర్, సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్

రూ.8,752 కోట్ల రుణాల మంజూరు

జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్

ప్రజాశక్తి- పలాస

2024-25లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు జిల్లాలో రూ.7,744 కోట్లు రుణాలు లక్ష్యం కాగా రూ. 8,752 కోట్లు రుణాలు మంజూరు చేసి లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేయడం జరిగిందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సూర్య కిరణ్ చెప్పారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 వేల డ్వాక్రా సంఘాలకు రూ. 1800 కోట్లు రుణాలు మంజూరు చేసి శతశాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. జిల్లాలో 1200 సూర్య ఘర్ యూనిట్లు లక్ష్యంగా ఇప్పటివరకు సుమారు 800 సూర్య ఘర్ యూనిట్లకు రుణాలు మంజూరు చేశామన్నారు. ఎంఎస్ఎంఇ (పరిశ్రమలు) రంగంలో జిల్లా వ్యాప్తంగా రూ.1788 కోట్లు లక్ష్యంగా లక్ష్యానికి మించి రూ.1850 కోట్లు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. విద్యా రంగంలో రూ.50 కోట్లు లక్ష్యంగా రూ.53 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. కౌలు రైతులకు వివిధ రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో నాబార్డ్ డిడిఎం రమేష్ కృష్ణ, ఎపిడిఒ వసంత కుమార్, జెఎంఎల్ బిసి కన్వీనర్ హరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

'ఐతమ్'లో నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఏ హెచ్ఓడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బోనమ్ శివకుమార్ నూతనంగా రచించిన "ఫైనాన్షియల్ మార్కెట్స్ అండ్ ఇనిస్టిట్యూషన్స్" అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఎంబీఏ, బిబిఎం కోర్సులకు చెందిన విద్యార్థులకు ఈ పుస్తకం వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ బి.విష్ణుమూర్తి, అకాడెమిక్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసులు పాల్గొని రచయిత డాక్టర్ బోనమ్ శివకుమార్‌ను అభినందించారు. మరిన్ని విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను రచించాలని కోరారు.



సర్పంచ్‌లకు వినతిపత్రాలను అందజేస్తున్న ప్రయాణికులు

ఫ్లై ఓవర్ నిర్మాణానికి చొరవ చూపాలి

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేగేట్ల స్థానంలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి చొరవ చూపాలంటూ నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు పలు గ్రామ సర్పంచ్‌లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ నెల 20న 'రైల్వేగేట్ కష్టాలు ఎన్నాళ్లు ?' అంటూ ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి సమస్య పరిష్కారం కొరకు చొరవ చూపాలని కోరుతూ శుక్రవారం సర్పంచ్‌లకు వినతిపత్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు, సంతకవిటి మండలాలకు చెందిన నిత్య ప్రయాణికులు తాడివలస, గోరింట, తుంగపేట, గోకర్ణపల్లి సర్పంచ్‌లను కలిసి ఫ్లై ఓవర్ నిర్మాణానికి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యాచరణను రూపొందించాలని కోరారు. రైల్వేగేట్లు కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లను కలిసి వినతిపత్రాలను అందజేసి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి కిల్లి ఉషారాణి, గోరింట సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, తాడివలస సర్పంచ్ తమ్మినేని మహేష్, తుంగపేట సర్పంచ్ పప్పల వేణుగోపాలం, గోకర్ణపల్లి మాజీ సర్పంచ్ సీపాన శ్రీరంగనాయకులను కలిసి వినతిపత్రాలను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సోమేశ్వరరావు

ఇకెవైసి తప్పనిసరి

నందిగాం: రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఇకెవైసిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఇకెవైసిపై ప్రతిఒక్కరూ చొరవ చూపాలన్నారు. ప్రస్తుతం మండలంలో 5 వేల మంది వరకు ఇకెవైసి చేయాల్సి ఉందని, లక్ష్యాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఇకెవైసి తప్పనిసరని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిటి ఆర్.రామారావు, సివిల్ సప్లై డిటి ఈశ్వర్ పాత్రో, సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

అప్పారి వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి ఎంతగానో కృషి చేశారని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్ అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అప్పారి వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్ల సర్వీసును తృణప్రాయంగా విడిచిపెట్టి ఉపాధ్యాయ ఉద్యమానికి సిద్ధమయ్యారని గుర్తుచేశారు. 50 వసంతాలు పూర్తి చేసుకున్న యుటిఎఫ్ ఆవిర్భావానికి ఆయన చేసిన త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శులు అన్నాజీ, నాయకులు గొంటి గిరిధర్, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

టెక్కలి: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. యుటిఎఫ్ టెక్కలి మండలశాఖ అధ్యక్షులు పి.గణపతిరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, మండల కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, నాయకులు డొంకాన పాపారావు, బి.అరుణ్ కుమార్, టి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల వసూళ్లకు ఒత్తిళ్లు

డిఆర్ఒకు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి పెంచి ఇబ్బందులకు గురిచేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిహెచ్.రాజు తెలిపారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ కళాశాలల ఖాతాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ చేస్తామని చెప్పినా యాజమాన్యం పట్టించుకోకుండా, పరీక్షల సమయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని చెప్పారు. సర్టిఫికెట్ జారీ, పరీక్షల ఫీజులు చెల్లించే సమయంలో , హాల్ టికెట్ జారీ సమయంలో ఇబ్బందులు పెడుతోందన్నారు. ఫీజు కడితేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని, ప్రాజెక్ట్ చేయిస్తామని విద్యార్థులను బెదిరిస్తోందన్నారు. యూనిఫామ్ ఆ కళాశాల ఇవ్వకుండా ఇన్‌షర్టు వేయలేదని, ఇతర కారణాలు చూపిస్తూ



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అపరాధరుసుమును అధిక మొత్తంలో విద్యార్థుల దగ్గర వసూలు చేస్తోందని చెప్పారు. దీంతో డిఆర్ఒ, కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులను ఇబ్బందులకు గురచేసే చర్యలు సరికాదని హెచ్చరించారు. డిఆర్ఒను కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు యు.దుర్గాప్రసాద్, బి.హరీష్, ఎం.సంతోష్ కుమార్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌బి గ్రేడ్-3 ఉద్యోగానికి ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆకాశ్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన గేదెల వెంకటరమణ ఆర్ఆర్‌బి గ్రేడ్-3 ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇటీవల రైల్వేశాఖ విడుదల చేసిన ఫలితాల్లో ఆయన ఉత్తమ ప్రతిభ కనబరచి ఉద్యోగాన్ని పొందారు. గతంలో 18ఏళ్ల పాటు ఎయిర్‌ఫోర్సులో సైనికునిగా విధులు నిర్వహించిన ఆయన ఇటీవలే ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం ఆర్ఆర్‌బి పోటీ పరీక్షలకు హాజరై తిరిగి ఉద్యోగాన్ని దక్కించుకున్నాడు. గతేడాది డిశంబరు 23న విశాఖ నగరంలోని షీలానగర్‌లో ఉన్న ఐకాన్ పరీక్షా కేంద్రంలో ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష రాసిన ఆయన విజేతగా నిలిచారని కోచింగ్ సెంటర్ అధినేత సిహెచ్ వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

నేడు లావేరు మండల సమావేశం

ప్రజాశక్తి- లావేరు

లావేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగనుందని, ఈ సమావేశనికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి సకాలంలో హాజరు కావాలన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

లైంగిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- టెక్కలి

లైంగిక నేరాలపై పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జె. శ్రీనివాసరావు సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బన్నువాడలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం కోసం ప్రభుత్వం పోక్సో చట్టాన్ని రూపొందించిందని, దీనిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డి.వి.వివేకానంద, ప్యానెల్ న్యాయవాదులు మధుబాబు, ఎల్.బాలకృష్ణ, పి.ఆనందరావు, టెక్కలి పట్టణ ఎస్ఐ కె.రాము, సర్పంచ్ పోలాకి మోహనరావు, ఎంపిటిసి పాల్గుణరావు, నీటి సంఘం అధ్యక్షులు సనపల మురళీధర్, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



నిమ్మరసం పంపిణీ చేస్తున్న యువత

నిమ్మరసం పంపిణీ

కవిటి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా గత రెండు రోజులుగా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గ్రామంలోని యువత శీతల పానీయాలు పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా ఓ అజ్ఞాత వ్యక్తి ఆర్థికసాయంతో శుక్రవారం విద్యార్థులకు నిమ్మరసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువతతో పాటు ఆడ పిల్లలు కూడా పాల్గొని తమ సహాయ సహకారాలు అందజేశారు.

రోగులకు పళ్లు పంపిణీ

కొత్తూరు: వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన స్వగృహం వద్ద అభిమానులు ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయనతో కేకు కట్ చేయించారు. కార్యకర్తలు, అభిమానులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోతుగడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, కొయిలాపు సంజీవరావు, శ్రీనివాసరావు, ధర్మారావు, రేగేటి కన్నయ్య, రమణారావు, చిట్టిబాబు, పడాల వెంకటకృష్ణ, స్వరూప్, అగతముడి రంజిత్ కుమార్, సంజీవరావు, అప్పారావు, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో ఇష్టారాజ్యం

- గగ్గోలు పెడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



పెద్ద సవళాపురం రైతు సేవా కేంద్రం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పెద్ద సవళాపురం రైతు సేవా కేంద్రం విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ గత కొద్దిరోజులుగా సెలవులో ఉండడంతో కార్యాలయం సక్రమంగా తెరవక రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్రి రామారావు అన్నారు. రైతులు ధాన్యం విక్రయించేందుకు సంబంధించిన షెడ్యూల్ కోసం రైతుసేవా కేంద్రం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతు నమోదు విశిష్ట గుర్తింపు సంఖ్య చాలామంది రైతులకు నమోదు కాలేదని వివరించారు. ధాన్యం సేకరణ కోసం టార్పాలిన్లు వస్తే సెలవులో ఉన్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతులకు కాకుండా తనకు నచ్చిన దళారులకు ట్రక్ షీట్లు మంజూరు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిరోజూ రైతులు రైతు సేవా కేంద్రం చుట్టూ తిరుగుతూ గగ్గోలు పెడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో వాపోతున్నారు. విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ వ్యవహార శైలిపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

గిరిజన ఉత్పత్తులు కొనుగోలు చేయాలి



పెద్దమడిలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు


ప్రజాశక్తి- మెళియాపుట్టి

గిరిజన ఉత్పత్తులను జిసిసి ద్వారా ఎందుకు కొనుగోలు చేయడం లేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సిపిఎం జిల్లా సభ్యులు పోలాకి ప్రసాదరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని పెద్దమడి తదితర గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిసిసి, అటవీ శాఖ మధ్య ఇరవై ఒక రకాల గిరిజన ఉత్పత్తులను 2027 వరకు కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేసి కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. గిరిజన ఉత్పత్తులను బయట వర్తకులు కొంటే అటవీశాఖ అధికారులు ఫైన్లు వేయడంతో గిట్టుబాటు ధర లేక తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం జిసిసి ద్వారా రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. జిల్లాలో షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 25న చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగుచేస్తున్న కొండ పోరంబోకు బంజరు భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిఒ నంబర్ మూడు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సవర ఆదినారాయణ, పి.హేమ, కృష్ణవేణి, రాధ, జమున తదితరులు పాల్గొన్నారు.

మందుల దుకాణాల్లో దాడులు

ప్రజాశక్తి- పలాస

జిల్లాలోని పలాస, హిరమండలం, పాతపట్నం ప్రాంతాల్లో శుక్రవారం పలు మందుల దుకాణాల్లో విస్తృతంగా డ్రగ్స్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేశారు. ఆపరేషన్ గరుడ కార్యక్రమంలో భాగంగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఔషధ నియంత్రణ, ఈగల్స్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్, లోకల్ పోలీసుల ఆధ్వర్యంలో సంయుక్త దాడులను నిర్వహించారు. పలాసలో తర్లాన వాసుదేవరావు మందుల దుకాణంలో కాలం చెల్లిన మందులు, వైద్యుల మందుల చీటీ లేకుండా ఇస్తున్న మందులను అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు. పట్టుకున్న మందులను సీజ్ చేసి తరలించారు. సంబంధిత నిర్వాహకులు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా ఒకటి పట్టుకున్నా, వంద మందులు పట్టుకున్నా అదే కేసు ఉంటుందని, తమకు అడ్డు చెప్పవద్దని సూచించారు. అనంతరం టెక్కలి డ్రగ్ ఇన్స్పెక్టర్ యుగంధర్, శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సింహాచలం మాట్లాడుతూ పలాస, టెక్కలి రెవెన్యూ డివిజన్లలో మొత్తం నాలుగు షాపులను తనిఖీ చేసినట్లు తెలిపారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో రెండు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. పలాస ఔషధ దుకాణాల సంఘం అధ్యక్షుడు నిర్వహిస్తున్న తర్లన వాసుదేవరావు మెడికల్ షాపులో తనిఖీలు



మెడికల్ షాపును తనిఖీలు చేస్తున్న అధికారులు

నిర్వహించగా కాలం చెల్లిన మందులు నిల్వ ఉండడం గుర్తించామని, దీంతో పాటుగా వైద్యుల సలహా లేకుండా ఇస్తున్న మందులను విక్రయించడంతో కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. హిరమండలంలో జయశంకర్ మెడికల్ స్టోర్, పాతపట్నంలో మధు మెడికల్ షాపు కూడా తనిఖీ చేశామన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసై బలవుతున్నారని, ప్రమాదకరమైన మందులు మత్తు మందుగా వినియోగిస్తుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మెడికల్ షాపులో మందులు అమ్మేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

నాటుసారాను నిర్మూలిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నాటుసారాను నిర్మూలించి భవిష్యత్ తరాలకు బాట వేద్దామని నాటుసారా తయారు చేసేవారు, తయారీకి సహకరించిన వారిపై పీడీ చట్టాన్ని అమలు చేసి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆంపురంలో జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారాపై ప్రజల్లో అవగాహన కల్పించి నాటుసారా నిర్మూలన కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి నాటుసారా వల్ల ప్రజలకు కలిగే ఆర్థిక, సామాజిక ఇబ్బందులపై ప్రజల్లో అవగాహన పెంచడం జరుగుతుందన్నారు. నాటుసారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని, భవిష్యత్ తరాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. నాటుసారాను అరికట్టి ప్రజలందరినీ ఉజ్వల భవిష్యత్ వైపు నడిపించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు.. నాటుసారా తయారీ చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించడం, వ్యాపారాలను ప్రారంభించేందుకు సహాయాన్ని అందించడం వంటి చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలందరూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. నాటుసారా అమ్మే వారికి, కొనేవారికి భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు లభించే పరిస్థితి ఉండదని, దీనిని దృష్టిలో పెట్టుకొని నాటుసారా తయారు చేయడం, రవాణా చేయడం, కొనుగోలు చేయడం ఆపేయాలని సూచించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ఫిర్యాదులను రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్-14405కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడు నాటుసారా నిర్మూలనకు కట్టుబడి ఉంటానని తనవంతు బాధ్యతగా నాటుసారా నిర్మూలించేందుకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎస్ఐ పి.రమేష్ బాబు, ఎక్సైజ్ ఎస్ఐలు ఎస్‌వి రమణమూర్తి, ఆర్.మహేష్‌బాబు, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో అసాంఘిక కార్యకలాపాలు

పెడదారి పడుతున్న యువత

లావేరు: మండల కేంద్రం లావేరులోని వస్త్రపురి కాలనీ నడిబొడ్డున పోలీస్‌స్టేషన్, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల, కళాశాలకు అత్యంత సమీపంలో ఉన్న చేనేత సహకార సంఘం కామన్ ఫెసిలిటీ భవనం అసాంఘిక కార్యక్రమాలకు వేదికైంది. గ్రామానికి నడిబొడ్డున రెండు అంతస్థుల భవనంలో ఉండగా చేనేతకు సంబంధించిన కార్యక్రమాలు ఏవి జరగకపోవడంతో అందులో గంజాయి సేవించడం, పేకాట, మద్యం తదితర అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. దీంతో యువత పెడదారిన పడుతూ భవిష్యత్‌ను చేతులారా నాశనం



టెర్రస్‌పై ఓ మూలన ఉన్న యువకులు



భవనంలో మద్యం సీసాలు, పేకముక్కలు, సిగరెట్లు, గుట్కాప్యాకెట్లు

చేసుకుంటున్నారు. ఇక్కడ పట్టపగలు ఈ భవనంపై అంతస్తులోపల టెర్రస్‌పైన మద్యం బాటిళ్లు, గుట్కా ప్యాకెట్లు, పేకముక్కలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా యువత ఇందులోనే మద్యం, సిగరెట్లు, గంజాయి తాగుతూ రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల పర్యవేక్షణ లేక పోవడంతోనే యువతకు భయం లేకపోవడంతోనే పెడదారిన పడుతూ పాడవుతున్నారని, ఇటువంటి కార్యక్రమాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చోరీకి గురైన లారీ

చోరీకి గురైన లారీ పట్టివేత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణ నడిబొడ్డున ఉన్న పాత పెట్రోల్ బంక్ వద్ద లారీ చోరీకి గురికావడం సంచలనం సృష్టించింది. భారీ వాహనాన్ని రాత్రి సమయంలో గుర్తు తెలియని అగంతకులు దొంగిలించడంతో లారీ యజమాని పైల వాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ ముకుందరావు తన సిబ్బందితో ముమ్మరంగా విచారణ జరిపి ఎట్టకేలకు 24 గంటలకు ముందే చోరీకి గురైన లారీని పట్టుకున్నారు. పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలను వెతకగా చివరికి ఒడిశాలోని పితాతోళి గ్రామంలో లారీని గుర్తించారు. దొంగిలించిన లారీని స్వాధీనపర్చుకుని కటక్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. 24 గంటలు కాకముందే దొంగిలించబడిన లారీని ఛేదించిన పోలీసులకు ఎస్ఐ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- నందిగాం



ఉరేసుకున్న ఢిల్లీశ్వరరావు

మండలం హరిదాసు పురం గ్రామానికి చెందిన అక్కురాడ ఢిల్లీశ్వరరావు (37) శుక్రవారం సాయంత్రం జీడితోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సుశీల తోటలో తన భర్త ఉరేసుకున్నాడన్న విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న భార్య నందిగాం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మద్యం స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ సిబ్బంది

ఒడిశా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి- కవిటి

మండలం కొజ్జిరియా గ్రామ సమీపంలో శుక్రవారం జరిపిన దాడుల్లో ఒడిశా నుంచి కారులో మద్యం తరలిస్తున్న మామిడి విజయ్‌ను అదుపులోకి తీసుకుని కారు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఎస్ఐ సిహెచ్.వి.రమణారావు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా కారులో 20 ఒడిశా మద్యం సీసాలు గుర్తించినట్టు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి నిందుతున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా నాటుసారా, ఒడిశా మద్యం, గంజాయి విక్రయాలు, వినియోగాలు నివారించేందుకు స్థానికులు సహకరించాలని ఆయన కోరారు. వీటిని విక్రయించినా, వినియోగించినా టోల్ ఫ్రీ నెంబర్ 14405కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాల విషయంలో గోప్యత పాటిస్తామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ కాని స్టేబుళ్ల బి.లక్ష్మణరావు, డి.యోగేశ్వరరావు పాల్గొన్నారు.

వరి గడ్డి దగ్ధం

బూర్జ: మండలంలోని లాభాం గ్రామం నుంచి విశాఖపట్టణానికి ట్రాక్టరుతో తరలిస్తున్న వరిగడ్డి కొల్లివలస జంక్షన్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. కరెంటు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పులు రాలడంతో పూర్తిగా ఎండిన వరిగడ్డి కాలిపోయి మంటలు వ్యాపించాయి. స్థానికులు కొంతమేరకు మంటలను అదుపుచేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపుచేశారు.

కెజిబివిలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- లావేరు

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు లావేరు కెజిబివి ప్రిన్సిపాల్ బల్ల సుధ ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. https://apkgbv.apcfss.in సైట్ ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.

రగ్బీ జట్టు ఎంపిక

టెక్కలి: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల సందర్భంగా జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 23న ఆదివారం టెక్కలిలో నిర్వహించనున్నట్టు జిల్లా రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డొంకాన రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ జట్టు ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఎంపికైన జిల్లా జట్టు కర్నూల్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావును సంప్రదించాలని రామకృష్ణ తెలిపారు.


కవితా దినోత్సవంలో యురవే సభ్యులు

అంతర్జాతీయ కవితా దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువ రచయితల వేదిక (యురవే) ఆధ్వర్యాన నగరంలోని రైతు బజారు సమీపాన గల ప్రైవేటు కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. యువ రచయితల వేదిక వ్యవస్థాపకులు తంగి ఎర్రమ్మ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో సాహితీ వేత్తలు తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయితలు జంధ్యాల శరత్‌బాబు, కుదమ తిరుమలరావులు పాల్గొని మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి కవులు, కళాకారులు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు ఎన్నో ఉద్యమాలకు స్ఫూర్తి నిచ్చారని గుర్తు చేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పొట్నూరు మాలతి, గుడిమెట్ల గోపాలకృష్ణ, బగాది వెంకటరావు, ఆనెం భాస్కరరావు, పేడాడ వేదవతి, కరకవలస వాసవి, బలివాడ ధనుంజయరావు, చింతాడ రామచంద్రరావు, మండల గణస్వామి, బసిహెచ్‌కె. భాస్కరరావు, కిల్లాన శ్రీనివాసరావులు తమ కవితలను రాగయుక్తంగా వినిపించారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న సర్పంచ్, వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పిల్లలవలసలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.శివశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 67 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, కార్యదర్శి కె.లక్ష్మంనాయుడు, ఎఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్త మాలతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఒ బాబ్జీ

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- పొందూరు

ప్రకృతి వ్యవసాయ పద్దతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి బెండి బాబ్జీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై కెపిపి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో 2025 ఖరీఫ్ సీజన్‌లో చేపట్టాల్సి కార్యక్రమాలపై పలువురు చర్చించారు. కార్యక్రమంలో వెలుగు సిసి శ్యామలరావు, ఎన్ఎఫ్ఎ గోవింద, ఎన్ఎఫ్ఎ మాష్టర్ ట్రైనర్ కంబాపు కృష్ణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పైడి అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కరరావు, హైమావతి, మల్లేష్, రవి, వ్యవసాయ సిబ్బంది, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.


టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కరుణాకర్

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం


మెళియాపుట్టి: గాలికుంటు వ్యాధిపై పశుపోషకులందరూ అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు చెప్పారు. మండలంలో బురద రామచంద్రపురంలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో ఈ వ్యాధి సోకడం వల్ల పాలఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం, విదేశాల్లో పాల ఉత్పత్తులకు గిరాకీ లేకుండా పోవడం జరుగుతుందన్నారు. పశు పోషకులందరూ నాలుగు నెలలు దాటిన తమ పశువులన్నింటికీ వ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించుకోవాలని కోరారు. మండలంలో 15,200 పశువులకు టీకాలు వేయడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 9,162 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ గణపతిరావు, చిన్నారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలి

బూర్జ: మండలంలో ఉప్పినవలస పంచాయతీలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం ఇఒపిఆర్‌డి కె.విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిఒక్కరూ చెత్త సంపదపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే తడి, పొడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రలకు అందజేయాలని తెలిపారు. కేంద్రం ద్వారా తయారు చేసే వర్మీ కంపోస్ట్ అమ్మకాలు జరపాలన్నారు. అనంతరం క్లాప్‌మిత్ర హాజరు పట్టికతో పాటు రికార్డులను పరిశీలించారు. ప్రతిఒక్కరూ విధి నిర్వహణ సక్రంగా నిర్వహించాలన్నారు. ఆమెతో పాటు సర్పంచ్ ప్రతినిధి వెంకట రమణ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేరణ యాప్‌పై విద్యార్థులకు అవగాహన

సోంపేట: పట్టణంలోని సంస్కార భారతి డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం 'ప్రేరణ' యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ (బిసిడిఇ) కో-ఆర్డినేటర్ ఆచార్య అజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా డిగ్రీస్థాయి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగవుతాయని తెలిపారు. బిసిడిఇ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రేరణ మిత్ర కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బొడ్డ శ్రీరామమూర్తి అధ్యక్షత వహించగా శిక్షణ ఫౌండేషన్ (బెంగళూరు) కు చెందిన అప్పారావు, కళాశాల చైర్మన్ దేవరాజు, ఎఒ వి.పాపారావు, కళాశాల బిసిడిఇ సమన్వయకర్త ఎం.శరత్ బాబు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కో-ఆర్డినేటర్

ఉద్దానం పథకం లీకేజీలపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో అనేక గ్రామ పంచాయతీలో ఉద్దానం నీటి పథకం సరఫరాలో లీకేజీలపై సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పలువురు మాట్లాడుతూ ఉద్దానం ప్రాజెక్టు నీటి సరఫరాలో లీకేజీలు వస్తున్నట్లు తెలిపారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని సభ్యులు గురుమూర్తి, సంతోష్ మండల్, నర్తు వరప్రసాద్ ఆరోపించారు. తన గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వడం లేదని సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సంతోష్ మండల్ కోరారు. ఎంపిడిఒ రామారావు సమాధానం ఇస్తూ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతీల్లో ఎక్కడైనా బోర్లు మరమ్మతులు జరిగితే తక్షణం మరమ్మతులకు మెటీరియల్ సిద్ధంగా ఉందని ఎంపిడిఒ తెలిపారు. నాడు - నేడు పనుల్లో శాసనం గ్రామంలో ఇంకా రెండు భవనాలు నిర్మాణం జరగలేదని కారింగ మోహనరావు, కారింగ త్రినాథ విద్యాశాఖ అధికారి అప్పారావు దృష్టికి తీసుకువచ్చారు. అదనపు భవన


మాట్లాడుతున్న ఎంపిపి పుష్ప

నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ ఐరన్ స్కూల్ ఆవరణలో తుప్పు పట్టే స్థితిలో ఉందని, అసలు మిగిలిన గ్రాంట్ వస్తుందా రాదా అని ప్రశ్నించారు. ఈదుపురంలో సిఎం చంద్రబాబు నీటిపారుదల అభివృద్ధికి రూ.33 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఇచ్చిన హామీ ఎంత వరకు వచ్చిందని ఇరిగేషన్ ఎఇ పాణిగ్రహిని ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ ప్రశ్నించారు. సిఎం హామీ మేరకు ఇరిగేషన్ అధికారుల బృందం పరిశీలన చేసి వెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఉత్పత్తి ద్వారా పర్యావరణానికి మేలు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త జాట్

రణస్థలం : మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా మొక్కజొన్న సాగు చేసే రైతుల ఆదాయం మెరుగు పడుతుందని భారతీయ మొక్కజొన్న పరిశోధనా స్థానం, లూథియానా డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్.జాట్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని రణస్థలం మండలంలోని పతివాడపాలెం, పిషిణి, నెలివాడ గ్రామాల్లో దుక్కి దున్నకుండా మొక్కజొన్నను సాగుచేస్తున్న రైతుల క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భవిష్యత్ ఇంధన అవసరాల దృష్ట్యా మొక్కజొన్న వంటి పునరుత్పాదక వనరులతో ఇంధనం ఉత్పత్తి చేస్తే పర్యావరణానికి మేలు కలగడమే కాక, మొక్కజొన్న ఇథనాల్ ఉత్పత్తికి డిమాండ్ పెరిగి, మొక్కజొన్న ధరలు పెరగవచ్చన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కజొన్న రైతుల అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దాపురం సస్యప్రజననం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్, సస్యవిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త వి.సుజాత మాట్లాడుతూ మొక్కజొన్న పంట వ్యర్థాలను కాల్చడం వలన కూడా పర్యావరణానికి విపరీతమైన హాని జరగడమే కాకుండా, భూసారం కూడా క్షీణిస్తుందని, దానికి బదులు పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న సాగులో మెలకువలు, యాంత్రీకరణ విధానాలపై ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు, కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ రైతులకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ భూసార విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ కుమార్ అభిషేక్, డాక్టర్ శిలాధిత్య, సంస్థ డిప్యూటీ మేనేజర్ ఆర్. హరిబాబు, ఏరియా మేనేజర్స్ పి.తవిటినాయుడు, బి.లక్ష్మీ నరసింహమూర్తి, ఆర్.దేవుడుబాబు, సమన్వయకర్తలు నారాయణరావు, పి.రమణ, అభ్యుదయ రైతులు పి.అప్పలనాయుడు, పి.సింహాచలం పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణంతో తీవ్ర నష్టం


విష్ణుచక్రం వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు కోసం నిర్మిస్తున్న కల్వర్టులు, రహదారులతో స్థానిక రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతు సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోర్టు అప్రోచ్ రోడ్డు కోసం తంపర వద్ద నిర్మిస్తున్న కల్వర్టును స్థానిక నాయకులు, పలువురు రైతులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విష్ణు చక్రం ఊరికి ఎదురుగా ఉన్న తంపరను పూడ్చి కల్వర్టులు కట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివలన కాకరపల్లి పవర్ ప్లాంట్ ప్రాంతం, దండు గోపాలపురం, ఆకాశ లక్కవరం, యామలపేట, నౌపడ, ఇజ్జువరం ప్రాంతానికి చెందిన సుమారు 6 వేల ఎకరాల భూములకు ముంపు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ విషయమై పోర్టు అధికారులతో మాట్లాడి సమస్య వివరించామన్నారు. ఖరీఫ్ సీజన్‌పై ప్రభావం పడుతుందని సాంకేతిక సమస్యలు ఏర్పడతాయని పోర్టు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి సమస్య తీవ్రతను వివరించినట్లు చెప్పారు. మంత్రి ఆదేశాలతో శనివారం సంబంధిత కల్వర్టు వద్ద పోర్టు అధికారులు సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్నారు. స్థానిక రైతులు ఈ సమావేశానికి హాజరై వారి సమస్యలు పోర్టు యాజమాన్యానికి వివరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాకరపల్లి సర్పంచ్ జోగారావు, రైతు ప్రతినిధి కోత మధుసూదనరావు, మత్స్యకార ప్రతినిధి హన్నురావు తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గీత

టిడిపితోనే వసతుల కల్పన సాధ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన టిడిపితోనే సాధ్యమని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత అన్నారు. శుక్రవారం 14వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్ వీధిలో రూ.16.50 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎమ్మెల్యే రవికుమార్ చొరవతో మూడు కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. తొందరలోనే టెక్నికల్ శాంక్షన్స్ మంజూరై నిధులు రానున్నట్లు తెలిపారు. ఈ నిధులతో పురపాలక సంఘంలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా రూ.72 కోట్లతో పైపులైన్ల నిర్మాణానికి నిధులు మంజూరై గతంలో నిలిచిపోయిన పనుల పునరుద్ధరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆ పనులను తొందరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ, టిడిపి నాయకులు గుడ్ల దుర్గాప్రసాద్, నాగు, బి.వి. రమణ మూర్తి, పొట్నూరు శివ, ఇన్‌ఛార్జి కమిషనర్, ఎపిఎస్ జాన్సన్, పివివికె రాజు, సచివాల అడ్మిన్ హనుమంతు రామకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు: గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ పేర్కొన్నారు. మండలంలోని వావిలపల్లి పేటలో సిసి రహదారులు, కాలువల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ సహకారంతో రహదారులు, కాలువల నిర్మాణానికి సుమారు రూ.82లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు కండాపు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రామారావు, అప్పారావు, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెండిగెడ్డ నీటి వృథాకు 'చెక్' డ్యామ్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జిల్లాలో సాగునీటి ఇక్కట్లకు చెక్ పెట్టేందుకు, సాగునీటి కష్టాలను తీర్చాలన్న తలంపుతో వృథాగా పోతున్న వర్షపునీటికి అడ్డుకట్ట వేస్తూ చెక్ డ్యామ్‌లు నిర్మించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు పేర్కొన్నారు. మండలంలో బెండి, సీతాపురం, పెద్ద బొడ్డపాడు, కొండవూరు గ్రామాల ఎర్ర చెరువు, రామసాగర ఆయకట్టుకు నీరు అందించాలన్న ధ్యేయంతో జనసేన నాయకులు, సీతాపురం, పెద్ద బొడ్డపాడు గ్రామాల రైతులతో కలిసి బెండి గెడ్డపైన చెక్ డ్యామ్‌కు అనుకూలమైన ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. సముద్రంలోకి వృథాగా పోతున్న బెండి గెడ్డ జలాలకు అడ్డుకట్టవేసి సాగునీటి కష్టాలను తీర్చాలన్న తలంపుతో చెక్ డ్యాం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం త్వరలో


చెక్ డ్యాం కోసం అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నాయకులు

శ్రీకారం చుట్టబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో అర్జీ తులసీరావు, ఆనందరావు, హనుమంతు శివకుమార్, తమ్మినాన బాలకృష్ణ, తమ్మినాన గోపాలరావు, మణిగాం తాతయ్య, తమ్మినాన తారకేశ్వరరావు, తమ్మినాన జయరాం, తమ్మినాన నరసింహ పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : బహుమతులు అందజేస్తున్న డిఎఫ్ఒ

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా అటవీశాఖ అధికారి సంబంగి వెంకటేష్ ఆధ్వర్యాన నిర్వహించారు. న్యాయనిర్ణేతగా ఎన్‌టిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ అడవులు కాపాడితే భవిష్యత్ సురక్షితమని, అడవులు సంరక్షణ వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. కాలుష్య నియంత్రణతో పాటు పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ సమతుల్యత, అనేక ఔషధాల ఉత్పత్తి, ఆహార వనరులను సమకూర్చు కోవడంతో పాటు భూకంపాల నివారణకు తోడ్పడతాయన్నారు. చిత్రలేఖన పోటీలో ప్రథమ బహుమతిని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె.షర్మిల, టిపిఎం హైస్కూల్‌కు చెందిన నూకరాజు ద్వితీయ బహుమతిని, ఎవిఎన్ హైస్కూల్‌కు చెందిన శ్రీవల్లి, భరత్‌లు తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. వారికి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు.

పలాస: మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకొని జాతీయ హరితదళ క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో అంతరించి పోతున్న జీవుల ఛాయా చిత్ర ప్రదర్శన చేసి వాటి ప్రాధాన్యతను విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.వి.రమణారావు, ఎన్‌జిసి క్లస్టర్ సమన్వయకర్త కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఈశ్వరరావు, రమేష్, సుధా కుమారి, పద్మ, చంద్ర శేఖర్, యామిని, రజని కుమారి, జ్యోతమ్మ, అరుణకుమారి, కృష్ణవేణి, లక్ష్మీభాయి, విష్ణాచారి, జనార్ధన, రవితేజ పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణపై సంతృప్తి


టెక్కలి: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షను రాష్ట్ర ఎస్ఎస్‌సి పరిశీలకులు మస్తానయ్య పరిశీలించారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, ఆర్‌సిఎం. ఇన్‌ఫెంట్, మహాత్మా జ్యోతీభాపూలే పాఠశాలల్లో జరుగుతున్న కేంద్రాల వద్దకు వెళ్లి పరీక్షను పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు స్థానిక ఎంఇఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఆపద సమయంలో 'శక్తి యాప్'

ప్రజాశక్తి- కవిటి

మహిళలు ఆపద సమయంలో శక్తి యాప్ ఉపయోగించి రక్షణ పొందాలని కవిటి ఎస్ఐ రవివర్మ, మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి సూచించారు. స్థానిక ఎస్‌విజె విద్యా సంస్థలో శక్తి యాప్ వినియోగం, డౌన్‌లోడ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు అరికట్టడంలో శక్తి యాప్ పనిచేస్తుందని అన్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.వి.వి ప్రసాదరావు, సిఆర్‌పి తులసీదాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, ఎఒ జోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

తాగునీటి సమస్యకు పరిష్కారం

పలాస: పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు త్వరలో తాగునీటి సమస్యకు పరిష్కారం చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. కాశీబుగ్గలో తాగునీటి పైపులైన్ శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే గౌతు శిరీష సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తాగునీటి సమస్యను తీసుకు వెళ్లడంతో ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు ద్వారా తాగునీటి సరఫరా కోసం రూ.63.50 లక్షలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలో పనులు చేపట్టి తాగునీరు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఆయనతో పాటు ఎఇ కిరణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి-4తో జీవన ప్రమాణాల మెరుగు

ఆమదాలవలస: ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకే పి ఫోర్ సర్వే ప్రభుత్వం నిర్వహిస్తుందని సాధికార కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్ యాదవ్ అన్నారు. శుక్రవారం 9, 10 వ వార్డు లకు సంబంధించి వాంబే కాలనీలో పి ఫోర్ సర్వే లబ్ధిదారులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన ప్రజలను గుర్తించి వారి అభ్యున్నతికి సహకారం అందించి లబ్ధి చేకూరే పనులు చేపట్టడమే పి4 సర్వే ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటరావు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు మొయ్యి రమణ, కట్టమూరి చిన్నారావు, లంక నాగరాజు, షేక్ మాలిక్, వైకుంఠం, చిరంజీవి, కృష్ణకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.


జగన్‌ను కలిసిన పద్మావతి

జగన్‌తో పద్మావతి భేటీ

కవిటి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో వైసిపి మహిళా జోనల్ ఇన్‌ఛార్జి బెందాళం పద్మావతి శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా నిరంతరం ప్రజలతో మమేకమవ్వాలని, రాబోయేది తమ ప్రభుత్వమేనని జగన్మోహన్ రెడ్డి పద్మావతితో తెలిపారు.


పరీక్షా కేంద్రం ముందు వేచి ఉన్న విద్యార్థులు

'పది' విద్యార్థుల పాట్లు

టెక్కలి: స్థానిక బాలికోన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది. శుక్రవారం ఆంగ్ల పరీక్షకు బాలికోన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కేంద్రానికి చేరుకున్నారు. అయితే ఉదయం 8.45 నిమిషాల వరకు ప్రధాన ద్వారం వద్ద తలుపులు తీయకపోవడంతో ఎండలోనే విద్యార్థులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షా కేంద్రానికి అంగంట ముందే విద్యార్థులు చేరుకున్నప్పటికీ కేంద్రం తలుపులు తీయకపోవడంతో విద్యార్థులు ఎండలోనే అవస్థలు పడ్డారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి

చలివేంద్రం ఏర్పాటు

బూర్జ: మండలంలో ఉప్పినవలస గ్రామ కూడలి వద్ద శుక్రవారం సర్పంచ్ ప్రతినిధి వెంకట రమణ, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి చలివేంద్రం ఏర్పాటు చేశారు. పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారుల్లో జిల్లా ఉన్నతాధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. వీటిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ ఎంపిసి చదువుతున్న బి.ప్రసాద్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యాడు. మార్చి 26 నుంచి 30 వరకు బిహార్‌లోని జహీరాబాద్‌లో 46వ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థికి కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస: కాశీబుగ్గ చినబడాం పీడర్ పరిధిలో ఆర్‌డిఎస్ఎస్ పథకంలో భాగంగా నూతన విద్యుత్ స్తంభాలు వేయనుండడంతో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ యజ్ఞేశ్వరరావు తెలిపారు. పెంటిభద్ర, జయరామ చంద్రపురం, పద్మ నాభపురం, పాత జాతీయ రహదారి, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం అంతరకుడ్డ, రాజపురం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ప్రాజెక్ట్ పరిధిలో గల ఇచ్ఛాపురం, కవిటి మండలం, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో గల 257 మంది అంగన్వాడీ కార్యకర్తలకు రెండవ రోజు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి ఆధ్వర్యంలో రెండోరోజు శిక్షణాలో భాగంగా నవజాత శిశుసంరక్షణ, గర్భస్థ శిశుసంరక్షణ, లోప పోషణకు గురైన పిల్లలను జిల్లా పోషికా పునరావాస కేంద్రంలో జాయిన్ చేయాలన్నారు. ఈ శిక్షణలో ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ బి.సుజాత, ఎస్.నీలవేణి, పి.పల్లవి, పి.పుష్పలత, లక్ష్మీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆమదాలవలస: పోషకాహారంతోనే చిన్నారుల ఎదుగుదల సాధ్యమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐసిడిఎస్


ఇచ్ఛాపురం : శిక్షణ ఇస్తున్న ప్రాజెక్టు అధికారి నాగరాణి

కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తల రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని లోలుగులో రెండోరోజు అంగన్వాడీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ ఎస్.అనురాధ, సూపర్‌వైజర్ జి.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న అనిల్‌కుమార్ తదితరులు

కంప్యూటర్ మెళకువలు నేర్చుకోవాలి

పలాస: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న కొత్త విధానాలు, యాప్‌ల అప్‌లోడ్‌కు కంప్యూటర్ మెళకువలు నేర్చుకోవాలని విశాఖపట్టణానికి చెందిన మేక్సఫ్ సిఇఒ అనీల్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, రెవెన్యూ కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటర్‌ను ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకు వస్తుందని, వాటిని ప్రజల నుంచి డేటా తీసుకొని అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగించిన అధికారులు

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో విపరీతంగా చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దకు వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రజాశక్తి విలేకరి కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న పేరుకు పోయిన చెత్తా చెదారం ఫోటో తీయగా ఈ విషయం మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు దృష్టికి వెళ్ళింది. తక్షణమే కమిషనర్ స్పందించి పారిశుధ్య కార్మికులతో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించారు.


చెత్తను శుభ్రం చేసిన పారిశుధ్య కార్మికులు